# ఫైళ్ల పరిభ్రమణం

సోమంచి యజ్ఞన్న శాస్త్రి

స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ప్రభుత్వం ప్రజాప్రతినిధుల హస్తగతమయినా, పనులు మాత్రం పరాయి ప్రభువుల హయాములో వేసిన రైలు పట్టాలమీదనే నడుస్తున్నాయని గోలెడుతూ వుండేవారు ప్రజలు. కాని, ఈమధ్య ఆ గోడూ చెడిందట. సింగిల్ లైను రైలు పట్టాలమీద నడిచే రైళ్ళరద్దీ ఎక్కువయి పోడంవల్ల, సిగ్నల్ దొరక్క రైళ్ళు ఆగడమే ఎక్కువయిందికాని, నడక తక్కువే అయిందిట.

ఒకాయన అన్నారు "ప్రభుత్వమంతా విజయవాడ రైలుస్టేషను, స్టేషనులో మటుకు ఎప్పుడూ అమిత హడావిడి. ఏవో రైళ్ళు వొస్తూవుంటాయి, వెళిపోతూనూ వుంటాయి. కాని ఏ రైలూ, దాని నిర్ణీత సమయానికి వొచ్చిన పుణ్యానపోదు. నిజానికి రైలు ఎంత ఆలస్యంగా వొచ్చిందో తాపీగా గుణించుకోడానికి తప్ప మరెందుకూ టైమ్ టేబుల్ ఉపయోగపడదు. కొన్ని కొన్ని స్టేషన్లలో ఈ రైలు యిన్ని నిమిషాలు లేక గంటలు, ఆలస్యంగా వొస్తుందని చెప్పడం కద్దు. విజయవాడకి మాత్రం ఆబాధ లేదు. ఏ రైలు ఎప్పుడు ప్లాట్‌ఫారమ్ మీదికి వొస్తుందో నిజంగా ఎవరికీ తెలీదు. స్టేషన్‌దాకా వొచ్చినా, ఔటర్ సిగ్నల్ దగ్గిర ఆగి, విశ్రాంతి తీసుకుంటేనేగాని, రైలు ప్లాట్‌ఫారం దరిచేరకూడదు అన్న కఠోర నియమం ఒక్కటి మాత్రం విధిగా అమలు జరుగుతుంది విజయవాడలో :

అదే ప్రకారంగా అయిపోయిందిట ప్రభుత్వమూను. పనులు జరిగినా జరగకపోయినా, ఫైళ్ళన్నా జరుగుతూ వుండేవట లోగడ. కొంతకాలంగా అవీ జరగడం మానేశాయిట; అడుగడుగునా వాటిని తరిమితేగాని, తరమాలి అంటే భయపెట్టి వెనకనించి నెట్టడమే అనుకునేరు. అబ్బే ముందు నిలచి, పప్పూబెల్లం పెట్టి, పైకి లాగినా చాలు. పూర్వం సుందరాంగుల సున్నితమైన పాదతాడనం జరిగితేనేగాని అశోకం పుష్పించనట్టు, ఈ రోజున ముందునించో, వెనకనించో ఒత్తిడి తగిలితేనేగాని, ఏ ఫైలూ జరగక పోడం సంప్రదాయమయిపోయింది.



ఈమధ్య మైసూరులో కాబోలు ఓ ఫైలు ప్రయాణానికి ఎంత టైము పడుతుంది అని ప్రశ్నించడం ప్రారంభించారు. ఓ ఆఫీసరుగారి షెల్ఫుమీద ఫైళ్ళు తణిఖీ చేస్తూవుంటే పదిహేను సంవత్సరాలుగా ఆర్డరు కోసం ఎదురు చూస్తున్న ఓ ఫైలు కనిపించిందిట; ముక్తికోసం నిరీక్షిస్తున్న భక్తుడిలా. ఈ ఫైలు ఎందుకు యింతకాలం తీసుకుంది అని రభస ప్రారంభించారు. సెక్రెటేరియట్ ఉద్యోగులూ, ఆ ఆఫీసరుగారూ, ఏదో అశ్రద్ధచేసి, అపచారం చేసినట్టు అపవాదులు ప్రచారం చేశారు. ఇది చాలా అన్యాయం. కర్మ పరిపక్వం అయితేగాని జీవుడికి ముక్తి కలుగుతుందా ? గజేంద్రుడు ఎంత ఘోష పెడితే మాత్రం గడియొస్తేగాని భగవంతుడు కదిలి వొచ్చాడా ? మోక్ష ప్రదానానికి ముఖ్యం కాలగమనమా, కర్మ పరిపక్వమా? ఫైళ్ళ ప్రపంచంలో, ఫైలు జీవుడులాటిది. దాని పుణ్యం ఫలించాలి. లేదా పాపం పండాలి. అప్పుడుగాని ఆర్డరు పొందే యోగ్యత గడించుకోదు. ఆఫీసర్ల మీద కారాలూ, మిరియాలు నూరి అభాండాలు వేస్తే ఏం లాభం ?

ఏ ఆఫీసులోనైనా, చాలాకాలం తీసుకున్నాయన్న ఒకటి రెండు ఫైళ్ళు తీసి తరచి చూస్తే, ఈ విషయం స్పష్టంగా తెలుతుంది. ఉదాహరణకి మా ఆఫీసులో గంగారామ్ ప్రావిడెంటు ఫండుని గురించి తిరుగుతున్న ఫైలుని పరీక్షిద్దాం.

గంగారామ్ మా కార్పొరేషన్‌లో డ్రెయినేజి డిపార్టుమెంటులో, ఇరవై నాలుగో వార్డులో పనిచేస్తున్న మేస్త్రీ. ఇరవయేళ్ళు పనిచేశాడు. ఓమాటు శలవుమీద స్వగ్రామం వెళ్ళి, పూర్తవగానే తిరిగి బొంబాయి వొచ్చి పనిలో ప్రవేశించకుండా వాడి స్వగ్రామంలోనే చచ్చిపోయాడు. కొందరు కొందరు పోతే వున్న చిక్కులు విడిపోతాయి; పీడించుకు తినే సూపర్వైజరుగారు పోతే గుమాస్తాల ప్రాణం హాయిమన్నట్టు. అదేమిటో మరికొందరు పోతే బతికున్నప్పుడు వాళ్ళు ఓ సమస్య కాకపోయినా, పోయిన తరవాత మాత్రం మహా చిక్కులు తెచ్చి పెడతారు. ఈ గంగారామ్ కూడా అలాటి మనిషి అయాడు.


"మేస్త్రీ గంగారామ్ అయిదు నెల్ల కిందట ఒక నెల శలవుమీద వెళ్ళాడు. ఇప్పటిదాకా తిరిగి పనిలో ప్రవేశించలేదు. వెంటనే వొచ్చి పనిలో ప్రవేశిస్తేనే తప్ప ఉద్యోగం ఊడపీకేస్తామని నోటీసు యిస్తేనేగాని లాభం లేనట్టు తోస్తుంది. కనక రిజిష్టర్డు నోటీసు పంపడానికి అనుమతి యివ్వవలసింది" అని డ్రెయినేజి ఇంజనీరుగారు పై ఆఫీసరుగారికి ఫైలు పంపించారు. పై ఆఫీసరుగారు కాస్త స్ట్రిక్టు మనిషి అవడంవల్ల "మూడు నెలలు శలవు లేకుండా ఎవరైనా గైరు హాజరయితే వారికి నోటీసు జారీ చెయ్యమని రూలు వుండగా అయిదు నెలలదాకా ఎందుకు వూరుకున్నారు. ఎవరు ఈ ఆలస్యానికి కారణం ?" అని దానిమీద ప్రశ్నవేసి తిరిగి పంపించారు. "అయ్యా, వాడు వెళ్ళి అయిదు నెలలు అయినా, మొదటి నెల శలవవుంది, తరవాత శలవలేకుండా మూడు నెలలు వుండిపోయినా, నోటీసు యివ్వక్కర్లేదు. నాలుగు నెలలూ అయిపోగానే యింకా వాడు పనిలోకి రాలేదని నోటీసు యివ్వాలని వార్డు

ఆఫీసునించి సెక్షన్ ఆఫీసుకీ, సెక్షన్ ఆఫీసునించి బ్రాంచి ఆఫీసుకీ, బ్రాంచి ఆఫీసునించి హెడ్డాఫీసుకీ ప్రపోజలు ప్రయాణం చేసింది. దీనికి ఒక నెల పట్టింది. ఎవరూ ఆలస్యం చెయ్యలేదు. ఆలస్యానికి ఎవరూ బాధ్యులు కారు" అన్న సమాధానంతో మూడువారాల తరవాత ఆ ఫైలు మళ్ళీ ఆఫీసరుగారిని చేరింది. ఆయన "ఫైలు యింతకంటె చక చక నడిచి వుండవలసింది. ఈ సమాధానం ఏమీ బాగాలేదు" అని వ్రాసి ఫైలు మళ్ళీ పంపించేశారు. ఆఫీసరుగారి ఆర్డరు నోటు చేసుకోవలసింది అన్న రిమార్కుతో ఆ ఫైలు కిందికి దిగింది. వార్డులో గుమాస్తా ఆ ఫైలు అటూ యిటూ తిరగేసి "రిజిస్టరు నోటీసు యివ్వమని ఆఫీసరుగారి స్పెసిఫిక్ పర్మిషన్ యిందులో లేదు. అందుచేత నోటీసు పంపించడమా, మానడమా "స్పష్టం చెయ్య వలసింది" అని ఆ ఫైలుని తనపై ఆఫీసరుగారికి, ఆయన తనపై ఆఫీసరు గారికీ, వారు కోపగించుకున్న పెద్ద ఆఫీసరు గారికీ పంపించారు. మొదట కోపగించుకున్న ఆఫీసరుగారు మరోమాటు కోపగించుకుని "ఇంతకి క్రితమే నోటీసు ఎందుకు పంపించలేదు ? అని అడిగినదానికి అర్థం నోటీసు పంపించవలసింది అనే కదా ? ఈ పరిస్థితిలో స్పష్టం చెయ్యవలసిన అవసరం ఏమొచ్చింది ? ఈ ఆపీసులో ఎవరూ బుర్ర దగ్గిర పెట్టుకుని తెలివితేటలతో పని చెయ్యడంలేదు. ఇహనించీ అందరూ తెలివితేటలతో పనిచెయ్యాలి" అని ఘాటుగా తగిలించి, ఆ ఫైలుని కిందకి తోశాడు.

"'ఆడలేనమ్మ మద్దెల ఓటి దన్నట్టు' అసలు పాయింటుమీద ఆర్డరెయ్యకుండా, మనమీద విసుచుకు పడతాడేం ? ఈయన కుంది మహాతెలివి" అని గుమాస్తా అందరూ కంటగించుకున్న తరవాత, మరో పది రోజులకి "నువ్వు వెంటనే పనిలో జేరకపోతే నీ ఉద్యోగం వూడబెరికి వెయ్యబడును. ఇతర డిసిప్లినరీ చర్యకూడా తీసుకోబడును" అన్న నోటీసు గంగారాముడి పేర జారీ అయింది. అప్పటికి వాడుపోయి ఆరు నెల్లయిపోయింది కనక, ఓ నెల రోజుల తరవాత ఆపేర మనిషి యిక్కడెవ్వరూ లేరు అన్న తపాలా ముద్రతో నోటీసు తిరిగొచ్చింది. ఇప్పుడు ఏం చెయ్యాలి అన్న అంశంమీద ఫైలు ఓ మాటు పైకి, కిందకీ నడిచిన తరవాత ఒక రిమైండరు పంపించి, లాయరు నోటీసు యిచ్చి, వుద్యోగం పీకెయ్యవలసిందని నిర్ణయం జరిగింది. పాత ఎడ్రెస్‌కి పంపిస్తున్న నోటీసులన్నీ తిరిగొచ్చేస్తున్నాయని తెలిసినా పద్ధతి ప్రకారం మళ్ళీ ఆ చిరునామాకే గంగారాముడి ఉద్యోగం పీకేసిన సంగతి తెలియబర్చేశారు. ఆపీసు రికార్డుల్లోంచి గంగారాముణ్ణి తొలగించేసి చేతులు దులిపేసుకున్నారు.

అయితే ఇరవయ్యేళ్ళు పనిచేసిన గంగారాముడిని అంత తేలికగా తుడిచి పారేసుకోగలరా ?

"అయ్యా ! నాభర్త గంగారామ్ పోయి సంవత్సరం దాటిపోయింది. ఇరవయ్యేళ్ళు మీ దగ్గిర పనిచేశాడు. నేనూ, నలుగురు పిల్లలూ మాడిపోతున్నాము. పిల్లలందరూ చిన్నవాళ్ళు. నేనే పోషించాలి. నాకేదైనా ఉద్యోగం యిప్పించమని అర్జీలుపెట్టుకుంటే ఎవరూ వినడంలేదు. ఏదో ఫండు రావాలట. దానికోసం కూడా ఆరు అర్జీలు పెట్టుకున్నాను. ఎవ్వరూ పట్టించుకోడం లేదు. కనక తమరు స్వయంగా విచారించి న్యాయం దయచేయించవలసింది" అన్న పిటీషన్‌తో గంగారాముడి పెళ్ళాం, ఓరోజున కమీషనరుగారిని దర్శించుకుంది. ఏడిచింది.



ఆయన వెంటనే విచారిస్తామనీ హామీ యిచ్చి ఆమెని పంపించి గంగారాముడి ప్రావిడెంటు ఫండు సంగతి వెంటనే తేల్చెయ్యమనీ ఆరు అర్జీలుపెట్టుకున్నా ఎందుకు జాప్యం జరిగిందో సంజాయిషీ చెప్పుకోవలసిందనీ తాఖీదు జారీ చేశారు. ఆ తాఖీదు ఆయన పర్సనల్ అసిస్టెంటుని చేరగా, ఆయన "కమీషనరుగారి పై ఆర్డరు శ్రద్ధగా చదివి వాటికి సమాధానాలు వెంటనే పంపించ వలసింది" అని డబ్బు బట్వాడా చేసే అకౌంట్సు డిపార్టుమెంటుకి పంపించారు.

ఆ డిపార్టుమెంటువారు తమ రికార్డులన్నీ వెతికి సదరు గంగారాముడికేసు తమ డిపార్టుమెంటుకి చేరనే లేదనీ, ఏ డిపార్టుమెంటులో వాడు బతికి వుండగా పనిచేశాడో ఆ డిపార్టుమెంటునే అడగవలిసిందనీ, ఆ కాగితాన్ని వాపసు చేశారు. ఎవరీ గంగారాముడు? ఏ డిపార్టుమెంటులో పనిచేశాడు? సినీమావాళ్ళయితే ఏ 'మిరకిల్', ఏ 'కో ఇన్ సిడెన్సో' పెట్టి ఈ సమస్యని పరిష్కారం చేసి వుండగలరుగాని ఆఫీసులో వీటికి జవాబులు తేలికగా దొరకవే ! ఫైలు

అన్ని డిపార్టుమెంటులకీ తిరగడం ప్రారంభించింది. చాలా డిపార్టుమెంటుల్లో గంగారాముళ్ళున్నారు. కొంతమంది చచ్చిపోయినా, కొంతమంది ఇంకా బతికేవున్నారు. చచ్చిపోయినవాళ్ళకి కొంతమందికి భార్యలున్నా, నలుగురు పిల్లలులేరు. ఈ పరిస్థితిలో, ఆరునెలలు, ఈ ఫైలు ప్రదక్షిణం చేసినా గంగారాముడి అంతు చిక్కలేదు - ఓనాడు గంగారాముడి పెళ్ళాం నలుగురు పిల్లలతోటీ ప్రత్యక్షమయి కమీషనరుగారి గదిలో జొరబడి, పూర్వం వాగ్దానంచేసినట్టు అందరూ కలిసి గీ పెట్టేదాకా!

ఈ గోలతో కమీషనరుగారు కుర్చీలో అదరిపడి తమ పి.ఏ. ని పిలిచి.వీళ్ళసంగతి తక్షణం కనిపెట్టమని అప్పగించారు. పి.ఏ. గారు వాళ్ళని తమ గదికి తీసుకుపోయి, మహాసముద్రమయిన కార్పొరేషన్ లో గంగారాముళ్ళు చాలామంది వుండడంవల్ల దానిభర్త అయిన లేటు గంగారాముడు ఏ డిపార్టుమెంటులో పనిచేశాడో తెలియకపోవడంవల్లనే ఆలస్యం జరిగిందనీ, ఇహ నిమిషాలమీద కాకపోయినా, రోజులమీదనయినా, దాని సంగతి తేలిపోతుందనీ ఓదార్చి పైనం అడిగాడు. అది తెలుగు, మరాఠీ హిందీ కలిపి మాట్లాడిన ముక్కలు ఎవరికీ తిన్నగా అర్థం కాకపోడంవల్ల, అది యిచ్చిన గుర్తులు, మన డిటెక్టివ్‌లకి హత్యా నేరం కనిపెట్టడానికి లభించిన చిహ్నాలుగా పరిగణించి చివరికి సదరు గంగారాముడు డ్రెయినేజి డిపార్టుమెంటులో ఇరవై నాలుగో వార్డులో పనిచేస్తున్నట్టు కనిపెట్టాను. ఆ ఆఫీసులో గంగారాముడు పత్తా లేకుండా పరారీ అయినట్టే నమోజు అయిందికాని, వాడు చచ్చిపోయినట్టు రికార్డు అయి వుండనందున, వాడి ప్రావిడెంటు ఫండు విషయమై ఎవరూ విచారించలేదనీ, ఇది తప్పేననీ సంజాయిషీ చెప్పుకుని ఇహ త్వరగా అన్నీ తేల్చేస్తామని వాగ్దానం చేశారు. దీనికి మరో ఆరునెల్లు పట్టింది. ఈలోగా గంగారాముడి పెళ్ళాం, పిల్లల సమేతంగావొచ్చి, కమీషనరుగారి సమక్షంలో ఓమాటు వారి పి. ఏ. గారి సమక్షంలో మూడుమాట్లూ ఏడిచింది. పి. ఏ. గారు తాము చేయగలిగినదంతా ఇదివరకే చేశామనీ, ఇహ మిగిలినదంతా, డ్రెయిదేజి డిపార్టుమెంటే చెయ్యాలి గనక సదరు ఆఫీసరు గారి దగ్గరికి కూడా వెళ్ళి ఏడవమని సలహాయిచ్చి నందువల్ల అక్కడికే వెళ్ళి తమ గొంతుకలు వినిపించింది. ఆ ఆఫీసరు గారికి యింట్లోనూ, వారి ఆడంగుల ఏడుపులు వినవలసివొచ్చేదిట. కనక ఆయన ఏమీ చలించక దాన్ని పంపించేశారు. ఇంకో ఆరునెల్లు గడిచిన తరవాత గంగారాముడి ప్రావిడెంటు ఫండు కాగితాలన్నీ తయారయి, వాడు తీసుకున్న అడ్వాన్సులూ, తీర్చవలసిన యితరబాకీలూ అన్నీ పోగా.వాడికి రావలసినది, నూట ముప్ఫై మూడురూపాయల నలభై రెండు నయాపైసలని తేలింది. ఇరవయ్యేళ్ళు పనిచేస్తే ఇంతేనా అని పెళ్ళాం గోలెట్టింది. కాన్ని దానికి ఎవరు సమాధానం చెప్పగలరు ?

ఇవ్వవలసిన మొత్తం తేలిందిగాని, దానికి 'యిమ్మని'ఆర్డరు పడడానికి వీల్లేకపోయింది. నీ పేరు ఏమిటమ్మా అంటే గంగూబాయి అని ఆమె సమాధానం చెబితే, ప్రావిడెంటు ఫండు డిక్లరేషన్‌లో తన పెళ్ళాంపేరు "గెంగి" అని వాడు రాయించుకున్నాడు. గెంగి, గంగూబాయి ఒకటేనా అని చాలా మీమాంస జరపవలసొచ్చింది. మాదేశంలో మొగుళ్ళు ముద్దుగా గంగి,గెంగి అని పిలుచుకునే ఆడాళ్ళే బొంబాయిలో గంగూబాయిలుగా నమోదు అవవొచ్చుననీ, నాలాటి వారు సాక్ష్యమిచ్చిన తరవాత గెంగి, గంగూబాయి అయివుండవచ్చునని డిపార్టుమెంటు అంగీకరించింది. కాని వాడి భార్య అయిన గెంగియే అన్ని డిపార్టుమెంటులూ తిరిగి ఏడుస్తున్న ఈ గంగూబాయి అని రుజువేమిటి? అది తన నలుగురి పిల్లల్నీ చూపించి ఇదే రుజువంటుంది. మొగుడినిబట్టి పిల్లల్ని రుజువుచెయ్యొచ్చుగాని, పిల్లల్నిబట్టి చచ్చిపోయిన మొగుడిని రుజువు చెయ్యడం ఎలా ? ఎవిడెన్సు ఆక్టు ఒప్పుకుంటుందా ? ఆడిటర్‌గారు తృప్తి పడతారా ? గంగారాముడు బతికి వుండగా గంగూబాయిని చూశానన్న వాళ్ళు సాక్ష్యమివ్వడానికి రాలేక పోలేదుగాని, గట్టిగా ప్రశ్నించగా వాళ్ళు గంగారాముడు కాస్త హుషారయినవాడే గనక, వాడితో మరి కొంతమంది స్త్రీలనీ చూశామనీ, అందుచేత ఎవరు భార్యో, ఎవరు మరోటీ, మరోటో, చెప్పలేమని ఒప్పేసుకోవడంవల్ల వారి సాక్ష్యం ఏమీ పనికిరాకపోయింది.

వచ్చే నెల

బాలగంగాధర తిలక్

రచించిన

## శ్రీ సీతాపతి కథ

చివరికి కమీషనరుగారిసలహామీద ఓగ్యారంటీబాండుగాని,జామీనుగాని పుచ్చుకుని సొమ్ము దానికి విడుదల చెయ్యడానికి నిశ్చయమయింది. రెగ్యులేషన్ ప్రకారం రెండు వందల యాభయిరూపాయల ధరావతు కట్టమని దానికి చెప్పారు. దానికి రావలసిన నూటముప్ఫై మూడురూపాయల నలభై రెండు నయాపైసలు రాబట్టుకోడానికి అది రెండు వందల యాభయి రూపాయలు ముందు చెల్లించుకోవాలని, రూల్సు చూపించి దానితో వాదించినా, అది మొండిఘటం, వినిపించుకోదు. దాని సొమ్ము వెంటనే యిప్పించెయ్యమని గోలెడుతుంది పిల్లల్నందర్నీ తీసుకొచ్చి ఏడిపిస్తుంది. అది వొచ్చి ఏడిచినప్పుడల్లా కమీషనరుగారు రిమార్కులు అడుగుతారు. అది గ్యారంటీ కట్టగానే సొమ్ము ఇస్తామని డిపార్టుమెంటు సమాధానం పంపిస్తుంది. వీటితో ఫైలు చాలా లావుగానే తయారయింది. ఇప్పటికీ నాలుగేళ్ళయింది. ఈలోపుగా గెంగి, ఉరఫ్ గంగూబాయికి మరో వివాహమయి, మరో పిల్లడు పుట్టి, వాడితోటీ, ద్వితీయ భర్తతోటీ కూడా వొచ్చి మొదటి మొగుడి ప్రావిడెంటు ఫండుకోసం అది గోలపెడుతున్నా ప్రయోజనం ఏమిటి? ఆ ఫైలుకి ముక్తిలేదు. ఇంతకీ చెప్పొచ్చేదేమంటే, ఫైళ్ళు చాలాకాలం తిరుగుతాయని కోపగించుకుంటే ఏం లాభం! కొన్ని ఫైళ్ళు అలా ముక్తిలేకుండా తిరగడానికి పుడతాయి కర్మబంధంనించి, మోక్షం పొందాలన్న జ్ఞానం కలగని జీవుడులాగ.